క్లుప్తంగా

కండక్టర్‌పై దాడికి నిరసన

మదనపల్లె రూరల్ : టైమింగ్ విషయమై రెండు బస్సుల మధ్య జరిగిన వివాదంలో కండక్టర్‌పై జరిగిన దాడికి నిరసనగా శుక్రవారం బెంగళూరు బస్టాండ్‌లో బాధితుడి తరపున దొనబైలుకు చెందిన గ్రామస్తులు ధర్నా చేశారు. కండక్టర్‌పై మాజీ ప్రజాప్రతినిధి దాడిని ఖండిస్తూ నినాదాలు చేశారు. దాదాపు 20 నిమిషాలకు పైగా నిరసన కొనసాగడంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడింది. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. ఇప్పటికే ఘటనపై కేసు నమోదుచేశామని, అవసరమైతే ఉన్నతాధికారులను కలవాలని సూచించారు. అనుమతి లేకుండా రోడ్డుపై ధర్నాకు దిగడం సమంజసం కాదని చెప్పారు. దీంతో ఆందోళనకారులు ధర్నా విరమించి డీఎస్పీ కార్యాలయానికి బయలుదేరి వెళ్లారు.

తొమ్మిది మంది కోడిపందెం రాయుళ్ల అరెస్ట్

కలకడ : కోడిపందెం ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ గురునాథ తెలిపారు. వివరాలిలాఉన్నాయి.. శుక్రవారం మండలంలోని కె.కొత్తపల్లె సమీపంలో మామిడితోటలో కోడిపందెం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో ప్రత్యేక పోలీస్ సిబ్బంది, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించి జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2.83 లక్షలు నగదు, నాలుగు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. మండలంలో ఎక్కడైనా కోడి పందెం, పేకాట ఆడినా స్థానికులు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పీలేరు రూరల్ : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ బాలకృష్ణ అన్నారు. శుక్రవారం ఆటోద్వారా సైబర్ క్రైమ్ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పట్టణంలో ముమ్మరంగా ప్రచారం చేపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకర్షణీయమైన యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వేసవిలో ఎక్కువగా చోరీలు జరిగే ప్రమాదం ఉందని, ఊర్లకు, విహార యాత్రలకు వెళ్లే వారు తమ ఇంటి సమాచారాన్ని పోలీస్ వారికి తెలియజేస్తే వారి ఇంటిపై పోలీసు వారు ప్రత్యేక నిఘా ఉంచుతామని తెలిపారు. అపరిచిత వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రతి పౌరుడు పోలీస్ లాగా వ్యవహరించాలని తెలిపారు. డుతున్న దృశ్యం

ఎయిడ్స్ నివారణపై కళాజాత

రామసముద్రం: మండలంలోని గుంతయంబాడి గ్రామంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశాఖ , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జనచేతన టీఐ ప్రాజెక్టు సంయుక్త ఆధ్వర్యంలో హెచ్ఐవీ/ ఎయిడ్స్ నివారణపై జానపద కళాజాత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కళాకారులు గ్రామ ప్రజలకు చేతులు పరిశుభ్రత, అంటు వ్యాధులు, వివిధ రకాల జ్వరాల గురించి, ప్రత్యేకంగా ఎయిడ్స్, టీబీ జబ్బులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లీలా సిహెచ్‌వో, పీహెచ్ఎస్ సూపర్‌వైజర్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కలికిరి: మండల పరిధిలో పేకట స్థావరంపై దాడి చేసి 16 మందిని అరెస్టు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ మదన్మోహన్ రెడ్డి తెలిపారు. వివరాలిలా... మండల పరిధిలోని కోర్లకుంట గ్రామం బెస్తపల్లికి తూర్పు దిశన నిర్మానుశ్య ప్రాంతంలో పేకాట నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు స్థానిక పోలీసులు, రాయచోటి స్పెషల్ ఫోర్స్ టీం దాడులు నిర్వహించారు. దాడులలో పేకాట ఆడుతున్న 16 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 15 మొబైల్ ఫోన్‌లు, తొమ్మిది ద్విచక్రవాహనాలు, రూ.1,50,850 నగదు స్వాధీన పరచుకుని కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన

– డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె రూరల్ : ప్రయాణాల సమయంలో రోడ్డుభద్రతపై వాహనదారులు, ప్రజలు, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ మహేంద్ర అన్నారు. శుక్రవారం రాత్రి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాలతో... రోడ్ సేఫ్టీపై పుంగనూరు బైపాస్ వై.జంక్షన్ వద్ద ద్విచక్రవాహనదారులకు, తాలూకా సీఐ కళావెంకటరమణతో కలిసి అవగాహన కల్పించారు.

ప్రతి కూలీకి ఉపాధిలో 100 రోజుల పని

– పీడీ వెంకటరత్నం

కేవీపల్లె : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పని అడిగిన ప్రతి కూలీకి 100 రోజుల పని కల్పిస్తామని పీడీ వెంకటరత్నం అన్నారు. శుక్రవారం మండలంలోని సారకాయలపేట పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న కాలువ పూడిక తీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు ఎక్కడికీ వలసలు వెళ్లకుండా స్థానికంగా పని కల్పిస్తామని తెలిపారు. రైతులు ఉపాధి హామీలో పండ్ల తోటలు పెంచుకోవాలని సూచించారు. ఆసక్తి గల రైతులు ఉపాధి సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఉపాధి పనుల్లో నాణ్యత కొరవడకుండా సిబ్బంది పర్యవేక్షించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీవో సుదాకర్, ఏపీఓ నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

నష్టాల ఊబిలో టమాటా రైతులు



పొలంలోనే వదిలివేసిన టమాట పంట



రోడ్డుపక్కన పారబోసిన టమాటాలు

- మార్కెట్‌లో ధరలు పతనం
- రైతుల కష్టం నేలపాలు
- పట్టించుకోని ప్రభుత్వం

తంబళ్లపల్లె: ఈ ఏడాది మండలంలో టమాట సాగు చేసిన రైతులకు మార్కెట్‌లో ధరలు పతనం కావడంతో రైతుల కష్టం నేలపాలవుతోంది. ఇంతజరుగుతున్నా రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం మేలో 25 కిలో బాక్సు రూ.2,700 వరకు ధర పలికింది. ప్రస్తుతం రూ.30 నుంచి కాయలు నాణ్యత బట్టి రూ.100 వరకు ధర ఉంది. దీంతో రైతుల పెట్టుబడి మాట దేవుడు ఎరుగు. కనీసం కూలీలు, రవాణాఖర్చులకు కూడా రాకపోవడంతో చేసేది లేక చేతికి వచ్చిన పంటను నేలపాలు చేసిన దుస్థితి. ఈఏడాది మండలంలో సుమారు 5వేల ఎకరాలకుపైగా సాగు చేశారు. ఎకరాకు 1.5 లక్షల నుంచి 2 లక్షల వరకు ఖర్చు చేశారు. ప్రస్తుతం సుమారు 3వేల ఎకరాల్లో పంట దిగుబడి వచ్చి కాయలు మార్కెట్‌కు తరలిస్తున్నారు. ధరలు లేకపోవడంతో రైతులు ఆ పంటను అమ్మలేక రోడ్డువెంబడి పారబోస్తున్నారు. పరసతోపు పంచాయతీ పెండేరివారిపల్లెకు చెందిన రైతు మల్లప్ప రెండు ఎకరాల్లో టమాట సాగు చేశాడు.

గురువారం 190 క్రేట్‌లు రోడ్డుపక్కన పారబోశారు. కాయలను మరి కొందరు రైతులు పొలాల్లోనే వదిలివేసిన దుస్థితి. గతంలో ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధరలతో పాటు ప్రభుత్వమే కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు తరలించి రైతులను ఆదుకున్నారు. నేడు ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని విమర్శలు గుప్పిస్తున్నారు. మార్కెట్‌లో జాక్‌పాట్, కమీషన్ల పేరుతో దండు కుంటున్నారని ఆరోపిస్తున్నారు.ప్రభుత్వం స్పందించాల్సి ఉంది.

ఏడుఎకరాల్లో సాగు చేశా



టమాటతో ఆదాయం పొందవచ్చునని ఆశతో ఏడు ఎకరాల్లో సాగు చేశా. రూ. పది లక్షల వరకు సాగుకు ఖర్చు చేశాను. పంట ఆశాజనంగా వచ్చింది. ప్రస్తుతం మూడు ఎకరాలు పంట కోతకు వచ్చింది. అయినా మార్కెట్‌లో ధరలేకపోవడంతో కేవలం మూడు కోతలకు లక్ష రూపాయలు మిగిలింది. పొలాల్లోనే పంటను వదిలివేశాను.

-జీ.నరసింహారెడ్డి, గౌడసానిపల్లె, తంబళ్లపల్లె

ప్రభుత్వమే ఆదుకోవాలి



ప్రభుత్వం స్పందించి టమాట రైతును ఆదుకోవాలి. రూ.1.50 లక్ష ఖర్చుతో ఎకరా టమాట సాగు చేశా. పంటదిగుబడి వచ్చినా పూర్తిగా నష్టపోతున్నాం. మార్కెట్‌లో ధరలు లేకపోవడంతో పంటను వదిలేయాల్సి వస్తోంది. కూలి ఖర్చులు కూడా గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి.

- చంద్రశేఖర్, పెండేరివారిపల్లె, తంబళ్లపల్లె

ఓటరు జాబితాపై అభ్యంతరాలను తెలపవచ్చు

సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె రూరల్ : ఓటరుజాబితాలో సవరణలు, బీఎల్ఓలు, వివిధ రకాల ఫారంలు, తదితర అంశాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే రాజకీయపార్టీల నాయకులు తెలపాలని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ కోరారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశమందిరంలో వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ...ఎన్నికల నిర్వహణను మరింత పారదర్శకంగా, పటిష్టంగా చేపట్టడానికి రాజకీయపార్టీల అభిప్రాయాలు, సూచనలు కీలకమన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఓటరుజాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా అమలుచేయాలని, ఫాం 6,7,9ల క్లెయిమ్‌లను పారదర్శకంగా పరిష్కరించాలన్నారు. వీటికి సంబంధించి ఏవైనా అభ్యంతరాలు, వినతులు ఉంటే ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని రాజకీయపార్టీల ప్రతినిధులకు సూచించారు. పోలింగ్ కేంద్రాలు కనీసం 2 కి.మీ.లలోపే ఉండాలని, అంతకంటే ఎక్కువ దూరం ఉంటే ప్రత్యేక పోలింగ్ బూత్‌ను ఏర్పాటుచేసేందుకు ఎన్నికల సంఘం అనుమతిస్తుందన్నారు. కనీసం 800కు పైన 1,200 ఓటర్లకు లోపు ఉండాలన్నారు. కార్యక్రమంలో మదనపల్లె, రామసముద్రం, నిమ్మనపల్లె తహసీల్దార్‌లు ధనంజయులు, నిర్మల, అమరనాథ్, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, సబ్ కలెక్టరేట్ ఏఓ రాఘవేంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, జనసేన జంగాల శివరాం, కాంగ్రెస్ రెడ్డిసాహెబ్, టీడీపీ బాలుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



శిలెమాతమ్మకు బోనాలు, దీవిటీలు సమర్పిస్తున్న మహిళలు

గుర్రంకొండ: మండలకేంద్రమైన గుర్రంకొండలో బోనాల పండుగను మహిళలు ఘనంగా జరుపుకొన్నారు. గ్రామదేవత శ్రీ పోలేరమ్మతల్లి తిరునాల ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజున అమ్మవార్లకు బోనాలు సమర్పించడం ఆనవాయితీ. ఈనేపథ్యంలో శుక్రవారం ఉదయం స్థానిక బజారు వీధిలో ఉన్న అమ్మవారిని మేళతాళాలతో ఊరేగింపుగా పోలేరమ్మతల్లి ఆలయానికి తీసుకెళ్లారు. అమ్మవారి సేవకులు ఆనవాయితీ ప్రకారం అమ్మవారికి మొదటి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. అనంతరం గ్రామంలోని మహిళలు చలివిడి ముద్దలు, బోనాలు, దీవిటీలను మేళతాళతో కోటలోని శిలేమాతమ్మకు, పోలేరమ్మతల్లికి సమర్పించారు. మేళతాళాలతో పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చుతూ బోనాల ఊరేగింపు నిర్వహించారు. పలువురు భక్తులు చీరెసారెలు సమర్పించి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకొన్నారు. జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వైభవంగా గంగమ్మ జాతర ధ్వజారోహణం



శాంతిహోమం నిర్వహిస్తున్న పండితులు, ఆలయ ధర్మకర్త రామ్‌కుమార్‌రెడ్డి

కలికిరి(వాల్మీకిపురం): పట్టణ పరిధిలో వెలసిన గ్రామదేవత శ్రీనల్లవీర గంగాభవాని జాతర మహోత్సవాలలో భాగంగా శుక్రవారం ఆలయంలో ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు. జాతర మహోత్సవానికి ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పడింతులు రమేష్‌స్వామి, ఆలయ అర్చకులు జనార్ధన్‌స్వామి ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో గణపతి పూజ, నవగ్రహ పూజ, కళశస్థాపన, శాంతి హోమాదులు చేపట్టారు. జాతర ఉత్సవంలో భాగంగా శేష పోయుట, అఖండ జ్యోతి, ఉలవ దేవర కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. నల్లవీర గంగాభవాని అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి పూలస నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్త మొర్రంరెడ్డి రామ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆదివారం నల్లవీర గంగాభవాని జాతర వైభవంగా జరుగుతుందని, ఇందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఆనందం శెట్టి, రమణారెడ్డి, బలారం, కోసూరి చంద్రమౌళి, జే.క్రిష్ణమూర్తి, బొక్కసం సోదరులు, రాజగోపాల్ పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం గర్నిమిట్ట యల్లమ్మ

- నేటి నుంచి యల్లమ్మ అమ్మవారి జాతర
- జాతరకు చురుగ్గా ఏర్పాట్లు



గర్నిమిట్ట యల్లమ్మ అమ్మవారి ఆలయం

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన గ్రామ దేవత శ్రీ యల్లమ్మ అమ్మవారు భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. ప్రతి ఏటా మొలకల పౌర్ణమి (బుద్ధపౌర్ణమి) అనంతరం వచ్చే ఆదివారం యల్లమ్మ అమ్మవారి జాతర అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శనివారం నుంచి సోమవారం వరకు అమ్మవారి జాతర అంగరంగవైభంగా నిర్వహించనున్నారు. గర్నిమిట్ట యల్లమ్మతల్లికి ఓ చరిత్ర ఉందని స్థానికులు కథలుగా చెబుతున్నారు. స్థానికుల కథనం మేరకు... మూడు వందల సంవత్సరాల క్రితం గర్నిమిట్ట కస్పాలో నివాసం ఉంటున్న శ్రీనివాసాచార్యులు, బాలయ్యశెట్టి మంచి స్నేహితులు. శ్రీనివాసాచార్యులకు పశువుల పాక ఉండేది. అక్కడ పశువులకు ప్రతి రోజూ పశుగ్రాసం వేస్తుండే వాడు. ఒక రోజు పశుగ్రాసం వేసే గాటిలో ఓ నల్లటి రాయి కన్పించింది. ఆ రాయిని తీసి బయట పడవేసి పశుగ్రాసం అందులో వేశాడు. అయితే ఆ నల్లటి రాయి మరుసటి తిరిగి పశుగ్రాసం గాటిలో యధాస్థితికి చేరుకోవడంతో శ్రీనివాసాచార్యులు ఆశ్చర్యపోయాడు. ఆ రోజు కూడా రాయిని తీసి బయట పడవేయగా, మరుసటి రోజు తిరిగి రాయి గాటిలో ప్రత్యక్షమైంది. వారం రోజులు ఇలా జరిగిన అనంతరం ఆ రాయిని బలంగా గోడకేసి కొట్టాడు. అయితే ఆ రాయి నుంచి రక్తపు మరకలు రావడంతో ఇదేదో మాయగా ఉందని భావించాడు. అదేరోజు రాత్రి గ్రామంలో ఓ మహిళకు దేవత కలలో కన్పించి నేను ఓ బ్రాహ్మనుడికి ప్రత్యక్షమైతే పట్టించుకోవడం లేదని, నన్ను గ్రామ దేవతగా కొలిస్తే గ్రామ ప్రజలను చల్లగా కాపాడుతానని చెప్పింది. ఆ మహిళ విషయాన్ని శ్రీనివాసాచార్యులకు తెలిపింది. నల్లటి రాయి అమ్మవారుగా భావించిన శ్రీనివాసాచార్యులు అతని స్నేహితుడు బాలయ్యశెట్టితో కలసి గర్నిమిట్ట గ్రామంలో ఓ గుడిని నిర్మించి ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి యల్లమ్మ అమ్మవారిగా కొలుస్తూ ప్రతి ఏటా జాతర నిర్వహిస్తున్నారు.

నేటి నుంచి అమ్మవారి జాతర

గుర్నిమిట్ట యల్లమ్మ జాతర శనివారం నుంచి మూడు రోజుల పాటు జరుగుతుందని నిర్వాహకులు సురేష్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

మదనపల్లె సిటీ: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని బీటీ కాలేజీ రిటైర్డు ఫిజికల్ డైరెక్టర్ బి.సుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం స్థానిక బీటీ కాలేజీ హాకీ మైదానంలో వేసవి హాకీ శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. వేసవిలో విద్యార్థులు శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మదనపల్లెకు చెందిన పలువురు హాకీక్రీడలో జాతీయ,రాష్ట్ర స్థాయిలో రాణించినట్లు గుర్తు చేశారు. మదనపల్లెలో ఎంతో మంది క్రీడాకారులు మంచి గుర్తింపు తీసుకువచ్చారన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను మైదానాలకు పంపాలన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు ప్రసాద్‌రెడ్డి, నౌషాద్, ఎంఎస్ రామయ్య కాలేజీ లైబ్రేరియన్ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల హక్కులు, చట్టాలపై అవగాహన

పీలేరు : బాలికల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వరూప అన్నారు. శుక్రవారం స్థానిక అజంతా టాకీస్ అంగన్‌వాడీ కేంద్రంలో కిషోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలు 18 సంవత్సరాలు, మగ పిల్లలు 21 సంవత్సరాలు తరువాత మాత్రమే పెళ్లి చేసుకోవాలన్నారు. సీఎంఎస్‌కే షర్మిల మాట్లాడుతూ సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ ప్రమాదాలు, పిల్లల హక్కులు సంబంధిత చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోక్సో చట్టం, పిల్లల హక్కుల రక్షణ, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 గూర్చి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ డి. లావణ్య, కిషోర్ బాలికలు, తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాం

– రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.మధు

పీలేరు రూరల్ : సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దామని రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్. మధు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక ఎక్సైజ్ కార్యాలయాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై ఆరాతీసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నవోదయం 2.0ను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. నాటు సారా నిర్మూలనపై పలు సలహాలు, సూచనలు తెలిపారు. అనంతరం నాటుసారా వద్దు – కుటుంబమే ముద్దు పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ వెంకటసుబ్బారెడ్డి, ఎస్ఐ లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

వెండి కిరీటం, పూజాపాత్రలు బహూకరణ



ఆలయ ఈఓకు వెండి కిరీటాన్ని అందజేస్తున్న దాతలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి దాతలు వెండి కిరీటం, వెండి పూజాపాత్రలు బహూకరించారు. అమ్మవారి ఆలయాన్ని రూ.2.50 కోట్లతో పునఃనిర్మించి విగ్రహ ప్రతిష్ట కావించారు. ఈనేపథ్యంలో శుక్రవారం చెర్లోపల్లె గ్రామానికి చెందిన రెడ్డిశేఖర్ నాయుడు వారి కుటుంబసభ్యులు రూ. లక్ష విలువ చేసే వెంటిశఠారీ, సహస్రధారపాత్ర, మదనపల్లెకు చెందిన ఆర్‌సీ రెడ్డెప్పనాయుడు, శారద దంపతులు 645 గ్రాముల బరువుగల వెండి కిరీటం, ఇత్తడి మకరతోరణం విరాళాంగా అందజేశారు. ఈసందర్బంగా ఆలయ ఈఓ మంజుల ఆలయ సంప్రదాయం ప్రకారం దాతలకు ఘన స్వాగతం పలికి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. అర్చకులు అమ్మవారి శేషవస్త్రాలు దాతలకు సమర్పించి ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు.

పుష్పయాగం.. భక్తజన పరవశం



పుష్పాలతో శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్న

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం పుష్పయాగం కనుల పండువగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణస్వామి ఉంచారు. మహిళలు వివిధ రకాల పూలతో గంపలతో ఆలయం వద్ద నుంచి మండపం వద్దకు తీసుకువచ్చారు. వేదపండితులు బాలాజీ, అమర, గోవర్ధన్‌లు వేదమంత్రోచ్చరణలతో మల్లె,జాజి,కనకాంబరం,రోజాలు, దవనంతో పాటు వివిధ రకాల పూలతో అలంకరించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా సాగేందుకు సహకరించిన అష్ట దిక్పాలకులు, పంచభూతాలు, దేవతామూర్తులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వారిని వారి లోకాలకు సాగనంపేందుకు నిర్వహించినదే ఈ పుష్పయాగోత్సవమని వేదపండితులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, మాజీ కమిటీ చైర్మన్ బింగి పాండు, గంగారపు భాస్కర్‌రెడ్డి, సాయిచిత్ర భాస్కర్‌నాయుడు, బింగి నాగేంద్ర ,దేవాదాయ సిబ్బంది అంకన్న, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల పునర్నిర్మాణ పనులు పరిశీలన



వీరభద్ర స్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న జిల్లా దేవదాయ శాఖ అధికారి విశ్వనాథ్

నిమనపల్లె: మండలంలోని శ్రీ నేలమల్లేశ్వర స్వామి దేవస్థానం, శ్రీ వీరభద్ర స్వామి ఆలయాలలో జరుగుతున్న పునర్నిర్మాణ పనులను జిల్లా దేవాదాయ శాఖ అధికారి విశ్వనాథ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తవళం నేలమల్లేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను చేపట్టడానికి ఇదివరకే రూ.3.18 కోట్ల నిధులతో ప్రతిపాదనలు పంపామన్నారు. అందులో భాగంగా దేవదాయ శాఖ శ్రీ నేలమల్లేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పునర్నిర్మాణ పనుల కోసం మొదటి విడతలో కోటి రూపాయలు మంజూరు చేశారన్నారు. ఆలయ గర్భగుడి నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. రెండో విడత నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కావాల్సి ఉందన్నారు. రాచవేటివారిపల్లె పంచాయతీ బొంతావారిపల్లెలో శ్రీ వీరభద్ర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను రూ.90 లక్షలతో చేపట్టడం జరిగిందని, పునర్నిర్మాణ పనులు దాదాపు పూర్తయినట్లు తెలిపారు. అలాగే రాచవేటివారిపల్లెలోని శ్రీ మృత్యుంజయ స్వామి ఆలయ ధూప, దీప, నైవేద్య, కైంకర్యాలను ప్రభుత్వం చేపట్టాలని గ్రామస్తుల వినతి మేరకు, ఆలయాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. ధూప, దీప, నైవేద్య కైంకర్యాలు దేవదాయ శాఖ చేపట్టడానికి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

అమరవీరులకు జోహార్లు





జాతీయజెండాలతో తిరంగా ర్యాలీ, తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తదితరులు

– భారతసైన్యానికి మద్దతుగా తిరంగా ర్యాలీ
– ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు, యువకులు

మదనపల్లె రూరల్ : భారత సైనికులకు, ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా మదనపల్లె పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం ఉదయం కూటమినాయకుల ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి చిత్తూరు బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. సైన్యానికి మద్దతుగా నినాదాలు చేశారు. ఆపరేషన్ సింధూర్‌లో అమరులైన జవాన్లకు నివాళులు అర్పించారు. ఆపరేషన్ సింధూర్‌లో అమరుడైన తెలుగుతేజం మురళీనాయక్ చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఏర్పాటుచేసి, జాతీయజెండాలతో దేశభక్తి నినాదాలు చేస్తూ మహిళలు, యువకులు ర్యాలీలో పాల్గొనడం ప్రజలను ఆకట్టుకుంది. జాతీయ సమైక్యత, సమగ్రతను చాటేలా ర్యాలీ ఆద్యంతం జోహార్ అమరవీరులకు, అన్న నినాదంతో హోరెత్తింది. తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, రాజంపేట పార్లమెంటరీ జిల్లా బీజేపీ అధ్యక్షులు సాయిలోకేష్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, జనసేన నాయకులు మైఫోర్స్ మహేష్ తదితరులు మాట్లాడుతూ...దేశ రక్షణ కోసం పోరాడుతున్న భారత సైనికులకు మద్దతుగా నిలిచేందుకు, వారి త్యాగాలకు అభినందనలు తెలిపేందుకు తిరంగా ర్యాలీని నిర్వహించామన్నారు. కశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రమూకలు జరిపిన దాడిలో...మహిళల సింధూరం తుడిస్తే ఏం జరుగుతుందో ఆపరేషన్ సింధూర్ చెప్పిందన్నారు. దేశరక్షణలో పాతికేళ్ల తెలుగు యువతేజం మరళీనాయక్ ప్రాణత్యాగం మనందరికీ స్ఫూర్తి అని, భారత్‌పై ఉగ్రవాదులు దాడిచేయాలని చూస్తే, అదే వారికి చివరిరోజు అవుతుందన్నారు. పాకిస్తాన్ కుట్రలు, కుతంత్రాలు భారత్‌ను ఏమీ చేయలేవన్నారు. కార్యక్రమంలో నాయకులు మార్పూరిశశిధర్‌నాయుడు, ఆర్.కే.రామకృష్ణ, చీకలబైలు ప్రభాకర్, బీజేపీ జిల్లా కార్యదర్శులు యల్లంపల్లె ప్రశాంత్, ఆకులకృష్ణమూర్తి, జనసేన శ్రీరామరామాంజనేయులు, దారం అనిత, మెప్మా మహిళలు, పట్టణవాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన అవసరం



జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య అధికారులు, సిబ్బంది

మదనపల్లె రూరల్ : డెంగీ నివారణపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ రమేష్ బాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని త్యాగరాయ వీధిలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రంలో జాతీయ డెంగీ దినోత్సవం నిర్వహించారు. వ్యాధి నివారణకు క్షేత్రస్థాయిలో కృషి చేస్తామంటూ సమావేశం అనంతరం సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హెల్త్ సెక్రటరీలు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటి వద్దకు వెళ్లి, ఇంటి లోపల, బయట నీటి నిల్వలను చూసి లార్వాలు లేకుండా మూత పెట్టేటట్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ ఏడాది డెంగీ కేసులు లేకుండా వైద్య ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలన్నారు. నాలుగు రోజులు పైబడిన జ్వరం కేసులు వెంటనే సంబంధిత ఆరోగ్య కేంద్రాలకు రెఫర్ చేయాలన్నారు. డెంగీ కేసులు నమోదైన ప్రాంతాలలో పరిసరాల పరిశుభ్రత, జ్వరము సర్వే ఇంటి లోపల దోమల మందు పిచికారీ చేయించాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ఖలీలుల్లాహ్ ఖాన్ , వైద్యులు జిలానీ, సూపర్‌వైజర్ రెడ్డెమ్మ , హెల్త్ సెక్రటరీలు, ఆశాలు పాల్గొన్నారు.

డెంగీపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

పీలేరు : డెంగీపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పీలేరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీలేరు పట్టణంలో శుక్రవారం పీలేరు సీహెచ్‌సీ, తలపుల, రేగళ్లు పీహెచ్‌సీల ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్ రెడ్డి, సీహెచ్‌వో జయలక్ష్మీ, ఆరోగ్యసిబ్బంది విద్యాసాగర్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.